
శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- కొన్ని చోట్ల అందులోనే ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉద్యోగులు
- మరికొన్ని చోట్లా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న భవనాలు
- పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికుల అసంతృప్తి


రాంపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులు ఊడి ఒరిగిన పై కప్పు


చంద్రగిరిలో పైకప్పు పెచ్చులూడి పడటంతో తరగతి గదులోకి వచ్చిన వాన నీరు

పెనుకొండ రూరల్: రూ.కోట్లతో ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు నిర్మించారు. అయితే వాటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నా వాటినే నేటికీ ఉపయోగిస్తున్నారు. అయితే మరికొన్నింటిని ఎంతో ఖర్చుతో నిర్మించినా వాడుకలో లేకపోవడంతో ప్రజా ధనం వృథా అయింది. దీంతో ప్రస్తుతం అవి దిష్టిబొమ్మల్లా దర్శనం ఇస్తున్నాయి.

కూలేస్థితిలో ఉన్నా..

పెనుకొండ మండలంలోని రాంపురం అంగన్వాడీ కేంద్రంలో 12 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అంగన్వాడీ కేంద్రంలోని పై కప్పు పెచ్చులుడింది. అదికాస్తా వానకు నాని మధ్యలోకి ఒరిగింది. ఎప్పుడు కూలుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని అంగన్వాడీ టీచర్ నరసమ్మ చెబుతున్నారు.

చంద్రగిరిలో పాఠశాల

చంద్రగిరి గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో 27 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాలపై కప్పు మెత్తబడటంతో వర్షం నీరు నేరుగా గదుల్లోకి చేరుతోంది. సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మక్కాజిపల్లి తండాలో...

మక్కాజిపల్లి తండాలో పక్కా అంగన్వాడీ కేంద్రాన్ని ప్రభుత్వం కేటాయించలేదు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలనే అంగన్‌వాడీ కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. అయితే తేలికపాటి వర్షం పడినా గోడలు నానడంతో పాటు కేంద్రంలో పలు చోట్ల వర్షం నీరు ప్రవేశిస్తుండటం స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారిపల్లిలో...

అమ్మవారిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని అంగన్వాడీ కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భవనం బాగా నానింది. ఎప్పుడు కులిపోతుందోనని భయం భయంగా సిబ్బంది గ్రామంలోని కమ్యూనిటీ హాలులోకి తాత్కాలికంగా అంగన్వాడీ కేంద్రాన్ని మార్చుకున్నారు.

సోమందేపల్లిలో...

ఇటీవల కురిసిన వర్షాలకు సోమందేపల్లిలోని మండల సర్వసభ్య సమావేశ మందిరం గది పై పెచ్చులు ఊడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియకున్నా ఎవరికీ పట్టడం లేదని కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్



లేపాక్షి: లేపాక్షిలో ఆర్టీసీ బస్టాండు ఉన్నప్పటికీ బస్టాండులోకి బస్సులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. లేపాక్షి ఆలయాన్ని సందర్శించడానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు విచ్చేస్తుంటారు. హిందూపురం, కొడికొండ చెక్‌పోస్టు నుంచి వచ్చిపోయే బస్సులు లేపాక్షి బస్టాండులో నిలపాల్సి ఉంది. ఒక్క ఆర్టీసీ బస్సు కూడా బస్టాండులో నిలపకపోవడంతో బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అల్లరి మూకలకు, ప్రైవేటు వాహనాలు పార్కింగ్‌కు, పశువులకు పాకగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

26 వసతి గృహాలు..


రొళ్ల సీహెచ్‌సీ ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహాలు

రొళ్ల: స్థానికంగా నివాసం ఉండి ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించేందుకు అధికారుల సౌకర్యార్థం రూ.లక్షలాది వెచ్చించి నిర్మించిన వసతి గృహాలు నిరుపయోగంగా మారాయి. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో 38 ఏళ్లుగా ఎందుకూ పనికిరాకుండా శిథిలావస్థకు చేరాయి. రొళ్ల మండలంలో సుమారు 38 ఏళ్ల (1984–86) క్రితం అప్పటి ప్రభుత్వం దాదాపు రూ.50 లక్షలకు పైగా వెచ్చించి 26 వసతి గృహాలను అధికారుల సౌకర్యార్థం నిర్మించారు. ఇందులో రొళ్ల అప్పటి ప్రాథమిక ఇప్పుడు (సీహెచ్‌సీ) ఆరోగ్య కేంద్రం ఆవరణలో తొమ్మిది వసతి గృహాలు, పోలీస్‌శాఖ క్వార్టర్స్‌లో 11 వసతి గృహాలతో పాటు గుడిబండ ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో ఆరు వసతి గృహాలను నిర్మించారు. కొద్ది సంవత్సరాల పాటు మాత్రం అధికారులు నివాసం ఉన్నారు. తర్వాత నాటి నుంచి నేటి దాకా ఒక్కరోజు కూడా అధికారులు ఎవరూ అందులో నివాసం లేరు. భవనాలు శిథిలావస్థకు చేరాయన్న సాకుతో అనంతపురం, పుట్టపర్తి, కొత్తచెరువు, హిందూపురం, పెనుకొండ, ధర్మవరంతో పాటు మడకశిర తదితర పట్టణాల్లో నివాసం ఉంటూ అధికారులు విధులకు హాజరవుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో ?



మా ఊళ్లోని ప్రభుత్వ బడిలోనే మా పిల్లలు చదువుతున్నారు. తేలికపాటి వర్షం పడినా వర్షం నీరు నేరుగా పాఠశాల గదుల్లోకి ప్రవేశిస్తున్నాయి. పురాతనమైన పాఠశాల కావడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళనగా ఉంది. ఉపాధ్యాయుల కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వం అదనపు గదులను నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నాము.

– ప్రభాకర్,చంద్రగిరి గ్రామం.

అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలి



అంగన్‌వాడీ కేంద్రం పాతబడింది. పై పెచ్చులు ఊడటంతో పాటు మధ్యలోకి ఒరిగిపోయింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీక మేమంతా ఆందోళన చెందుతున్నాము. వర్షం పడితే ఆరు బయటే ఉండాల్సి వస్తోంది. త్వరితగతిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మరోచోటికి మార్చాలి.

– చిన్న అంజినేయులు, రాంపురం

నివేదికలు సమర్పించాం



రొళ్ల ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది సౌకర్యార్థం నిర్మించిన తొమ్మిది వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయి. పాత వసతి గృహాల స్థానంలో కొత్త భవనాలు నిర్మాణం చేపట్టాలని ఇప్పటికే నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపాము. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– బాలప్రణీత్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్, రొళ్ల

క్లుప్తంగా

టెక్నాలజీని ఉపయోగించుకోండి

- సచ్చిదానంద సరస్వతిస్వామి


మాట్లాడుతున్న సచ్చిదానంద సరస్వతిస్వామి

హిందూపురం టౌన్: 'ప్రస్తుత కాలంలో టెక్నాలజీ అందరికీ అందుబాటులో ఉంది. విద్యార్థులు సరైన పద్ధతిలో సద్వినియోగం చేసుకోవాలి' అని ఆర్యవైశ్య కుల గురువు, శ్రీవాసవీ పీఠం 2వ గురువు సచ్చిదానంద సరస్వతి స్వామిజీ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలను స్వామిజీ సందర్శించారు. స్వామిజీ మాట్లాడుతూ అధ్యాపక వృత్తి ఎంతో గొప్పదన్నారు. ఆర్యవైశ్య కులానికి చెందిన వారు హిందూపురంలో ఇంత పెద్ద కళాశాలను స్థాపించి విద్యనందించడం ఎంతో గొప్పవిషయమన్నారు. ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక విధంగా ఇతరులకు సహాయ పడాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ రేవూరి చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు దాసా సురేష్, దాసా గంగాధర్, నందకిశోర్, ప్రిన్సిపాళ్లు జేఎస్‌వీఎస్ ప్రసాద్, నాగేంద్ర కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శుభకార్యం

గుడిబండ: మండల కేంద్రలోని జంబులబండ గ్రామానికి చెందిన మంజునాథ్, లావణ్య వివాహ వేడుక ఎగ్గల్లులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. అలాగే మోపురుగుండు గ్రామానికి చెందిన బంగారిలింగప్ప, మమత వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వివాహాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయర్త ఈరలక్కప్పతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, పాండు, ఈరన్న తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం


కలశాలు మోస్తున్న భక్తులు


పావగడ: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత వాల్మీకి ఆలయంలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద వాల్మీరి సంజయ కుమార స్వామి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్ జయంతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వెండి రథంపై వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. మహిళలు పూర్ణ కుంభ కలశాలు మోశారు. అలాగే వెంకటాపురం గ్రామంలోనూ వాల్మీకి జయంత్యుత్సవాలు జరిగాయి.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


హీలింగ్ వైద్యం నిర్వహిస్తున్న వైద్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని కొట్నూరు నిర్మలా వృద్ధాశ్రమంలోని ఒయాసిస్ చర్చిలో బెంగళూరుకు చెందిన హీలింగ్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత హీలింగ్ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ వాయిద్య పరికరాలు టిబెటియన్ బౌలింగ్ లాంటి పరికరాలతో శబ్ద తరంగాలతో వైద్యం చేస్తామన్నారు. దీనివల్ల లక్షలాది మంది స్వస్థత పొందారన్నారు. అనంతరం పలువురికి వైద్య సేవలు అందించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


స్టీవెన్సన్‌కు స్వాగతం పలుకుతున్న సీఅండ్ ఐజీ మిషన్ కాంపౌండ్ సభ్యులు

హిందూపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ప్రఖ్యాత సువార్త గాయకులు డాక్టర్ ఏఆర్ స్టీవెన్సన్ తెలిపారు. స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సువార్త సంగీత పండుగకు ఆయన ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేశారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ స్టీఫెన్‌రాజ్, సభ్యులు నాగేంద్రకుమార్, సాల్మన్‌రాజ్, విక్టర్ జాషువా, డీకెన్ మెంబర్లు దేవరాజ్, జార్జిబాబు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

రొద్దం: మండల కేంద్రంలోని బూచెర్లకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన గ్రామ నడిబొడ్డున స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంత్రి సవిత ఆదివారం భూమి పూజ చేశారు.

అసలు దూరమెంత?



పది మీటర్ల దూరంలోనే రెండు రకాల దూరాలను తెలియజేస్తున్న నంబరు రాళ్లు

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి కొత్తచెరువు వెళ్లే మార్గ మధ్యలో మరువపల్లి క్రాస్ వద్ద దూరాన్ని తెలిపే రెండు రాళ్లలో భిన్నమైన నంబర్లు దర్శనమిస్తున్నాయి. అక్కడి నుంచి కొత్తచెరువుకు కచ్చితంగా 19 కిలో మీటర్లు ఉంది. పది మీటర్ల దూరంలో మరో రాయిపై కొత్త చెరువు 9 కిలో మీటర్లు ఉంది. రోజూ తిరిగే వాళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా కొత్తగా ఆ దారిలో వెళ్లే వారు మాత్రం కచ్చితంగా గందరగోళానికి గురవుతారు. ఏది నిజమో తెలుసుకునేందుకు గూగుల్ మ్యాప్ ఓపెన్ చెయ్యాల్సిన పరిస్థితి.

కెంపేగౌడ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న కుంచిటి వక్కలిగ కులస్తులు

అమరాపురం: మండల కేంద్రంలోని మడకశిర – హేమావతి కూడలిలో కుంచిటి వక్కలిగ కులస్తుల ఆరాధ్య దైవం కెంపేగౌడ విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక వక్కలిగ సేవా సమితి కెంపేగౌడ యువక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ సంఘం విభాగం అధ్యక్షుడు రంగేగౌడ, మడకశిర తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజు, బీబీఎంసీ కమిషనర్ తమ్మడేపల్లి వాస్తవ్యులు రాజు, అమరాపురం మండలం కుంచిటి వక్కలిగ సంఘ సభ్యులు విశ్వేశ్వర, ఎన్ఆర్ హనుమంతరాప్ప, హలుకూరు కాంతరాజు, కృష్ణమూర్తి, రాఘవేంద్ర, మంజునాథ్, రొళ్ల పాండురంగప్ప తదితరులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బీబీఎంసీ, చిత్రదుర్గ జిల్లా వక్కలిగ సంఘం డైరెక్టర్ పీజే రాజు, మడకశిర తాలూకా వక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజు చెరో రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. కేఎస్ పల్లి సురేష్ రూ.50 వేలు, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ నళిని రూ.25 వేలు ప్రకటించారు.

'విజిలెన్స్' సభ్యుడికి సన్మానం


గంగులయ్యను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన చెరుకూరి గంగులయ్యను అన్ని కుల సంఘాలు, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ, రాష్ట్రీయ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీలకు గంగులయ్య చేస్తున్న సేవలను గుర్తించి మళ్లీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కలెక్టర్ అవకాశం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులం నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కోటకొండ క్రిష్టప్ప, గొల్లపల్లి నాగేంద్ర, అంకే రాజప్ప, మోతుకుపల్లి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు


అలంకరణలో అభయాంజనేయస్వామి

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జ్యోతుల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రదక్షిణలు చేసిన తర్వాత స్వామివారికి సమర్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: 'కార్యకర్తలందరికీ అండగా ఉంటాం .గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి'. అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమసన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఆయన ఆదివారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఈరలక్కప్ప మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నాలుగు నెలలు అయిన అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని సీఎం చంద్రబాబుపై మండిపడ్డారు. అదే విధంగా రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. అప్పులు చేసి సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రూ.20 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి నేటికీ రైతులకు పైసా కూడా ఇవ్వలేదన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, రైతుకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు కొండత భరోసా కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, నాయకులు హలుక్కూరు కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


గుడిబండ: ఎంపికైన విద్యార్థులతో పీడీ సాయికృష్ణ, పీఈటీ అజారుద్దీన్


మడకశిర: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన లావణ్య, దీక్షతో పీఈటీ అరుణ

గుడిబండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప తెలిపారు. అండర్ – 17 విభాగంలో విజయ్, భానుప్రసాద్, అండర్ 14 విభాగంలో గురుచరణ్, దర్శన్ ఎంపికయ్యారు. స్విమ్మింగ్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు పల్నాడు జిల్లా నరసారావుపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

మడకశిరరూరల్: అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మడకశిర మండలం గౌడనహళ్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు.

10వ తరగతి చదువుతున్న లావణ్య అండర్–17 బేస్ బాల్, దీక్ష అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పీఈటీ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

'అధికారుల అండతోనే మట్టి తరలింపు'

సోమందేపల్లి: అధికారుల అండదండలతోనే మండలంలో అక్రమంగా మట్టి తరలిపోతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ఆరోపించారు. ఆదివారం సోమందేపల్లిలోని చెరువులో జేసీబీల ద్వారా ట్రాక్టర్లతో మట్టి తరలింపు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విచ్చలవిడిగా గుట్టలు, చెరువులో తవ్వకాలు చేపట్టి మట్టి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టక పోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సిద్ధేశ్వరస్వామికి కార్తీక పూజలు


అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని వివిధ ఆలయాల్లో స్వామి వార్లకు భక్తులు ఘనంగా కార్తీక తొలి ఆదివారం పూజలు నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

'కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు'

రొళ్ల: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇటీవల తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో మూడేళ్ల బాలికపై సుశాంత్ అనే యువకుడు అత్యాచారం చేసి చంపి పూడ్చి వేయడం బాధాకరన్నారు. ఇలాంటి సంఘటనలు రోజూ జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు హోం మంత్రి అనిత సిగ్గు పడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని గుడ్డదహళ్లి గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్న 9 మందిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. వచ్చిన పక్కా సమాచారం మేరకు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.8,100 ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతులపై కేసు నమోదు చేశామన్నారు.

యూటీఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఆదివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, భూతన్న, నారాయణ, రమేష్ తదితర యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.